క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులు చేపట్టిన పంచాయతీ సిబ్బంది


సాక్షి ఎఫెక్ట్

గుడివాడరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య పనులను సోమవారం చేపట్టారు. 'సాక్షి'లో ఈనెల 10వ తేదీన ప్రచురితమైన 'పారిశుద్ధ్యం పాతర' అనే కథనానికి అధికారులు స్పందించారు. లింగవరం గ్రామంలో గుడివాడ-పోలుకొండ రహదారి వెంబడి పేరుకుపోయిన చెత్తను తొలగించారు. అదేవిధంగా పలు గ్రామాల్లో కూడా పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

బ్రహ్మాస్త్రం తయారీ



మండవల్లి: మండలంలోని అల్లినగరం గౌతమ్ నేచురల్స్ ప్రకృతి వ్యవసాయ వండర్లా ఉత్పత్తుల కేంద్రంలో సోమవారం 50 లీటర్ల బ్రహ్మాస్త్రం తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ పచ్చపురుగు, పొగాకు లద్దె పురుగు నివారణకు ఎకరా పంట పొలాలపై మూడు లీటర్ల బ్రహ్మాస్త్రం, 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. యూనిట్ ఇన్‌చార్జి నాగవిజయ పాల్గొన్నారు.

మెడిసిన్ విద్యార్థికి ఆర్థిక సాయం



మొవ్వ: విశాఖపట్నంలో మెడిసిన్ మూడో సంవత్సరం చదువుతున్న తమ పాఠశాల పూర్వ విద్యార్థి కందుల పవన్ భాస్కర్‌కి సీఎం శ్రీ శ్రీ మండవ కనకయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల లెక్కల ఉపాధ్యాయురాలు కోనేరు లక్ష్మణ, మేకా రాణి దంపతులు 40,000 రూపాయలను సోమవారం అందజేశారు. హెచ్‌ఎం సూర్యదేవర శ్రీదేవి పాల్గొన్నారు.

పదో తరగతి ప్రీ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం

మొవ్వ: పదో తరగతి ప్రీపబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో 417 మంది విద్యార్థులు పాల్గొనగా మండల విద్యాశాఖ అధికారులు ఎన్. శివశంకర్, కే. శ్రీలక్ష్మి పరీక్షలను పర్యవేక్షించారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని జెడ్పీహైస్కూళ్లలో పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 20వ తేదీ వరకు ఈ పరీక్షలు కొనసాగుతాయి. వడాలి జెడ్పీ హైస్కూల్లో సీనియర్ ఉపాధ్యాయుడు సీహెచ్ నాగమల్లేశ్వరరావు తరగతి గదులను పర్యవేక్షించారు.

టిడ్కో కాలనీలో వినూత్న నిరసన



గుడివాడ టౌన్: టిడ్కో కాలనీలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలంటూ కోరుతూ బీజేపీ పట్టణ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ సోమవారం వినూత్న నిరసన చేపట్టారు. బీజేపీ కార్యకర్తలతో కలిసి స్థానికంగా పేరుకుపోయిన చెత్తను తొలగించి విషయాన్ని మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసరావుకు వివరించారు. దీంతో డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్త, కాలనీలో వ్యాపిస్తున్న వ్యర్థాలను తొలగించాలంటూ వినతి పత్రం సమర్పించారు.

మాతృభాష అవసరం



గుడివాడ టౌన్: సమాజానికి స్పష్టమైన, అర్థవంతమైన సందేశాన్ని అందించాలంటే మాతృభాష అవసరం అని గణపవరం డిగ్రీ కళాశాల అధ్యాపకులు జీవీ రమణ పేర్కొన్నారు. సోమవారం కళాశాల్లో సామాజిక మాధ్యమాలలో తెలుగు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సామాజిక మాధ్యమాలలో మాతృభాష వలన ప్రయోజనాలు, నష్టాలు విద్యార్థులకు వివరించారు. తెలుగు భాష అలవర్చుకోవలని సూచించారు. ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ డీఎస్ ప్రత్యేష పాల్గొన్నారు.

నేడు చెరువు వేలంపాట

ముదినేపల్లి రూరల్: మండలంలోని చేవూరు శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి చెందిన 1.5 ఎకరాల చెరువుకు సంబంధించి మంగళవారం వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. వేలంపాటలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు రూ.25వేలు ధరావత్తుగా చెల్లించాలన్నారు.

ప్రజాప్రతినిధులను గౌరవించరా?

- కూటమి నాయకుల సేవలో తరిస్తున్న అధికారులు
- అభివృద్ధి పనుల్లో ప్రజాప్రతినిధులను దూరం చేస్తున్న వైనం
- పెంజెంద్రలో ఒకచోట రోడ్డు తీర్మానమైతే.. మరొక చోట వేశారు!


మండల పరిషత్ సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్ తాతబ్బాయ్ (ఫైల్)

గుడ్లవల్లేరు: ఏ రాజకీయ పార్టీ అయినా ఎన్నికల వరకే రాజకీయాలు చేసుకోవాలి. అయితే కూటమి ప్రభుత్వం ప్రతిపక్షాలపై, ప్రతిపక్ష నాయకులపై కక్ష సాధింపులకు దిగుతూ వారిని అధికారుల ఊతంతో ఇబ్బందులకు గురి చేస్తోంది. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు అనే విషయం కూడా మరచి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి బాబు హయాంలో నిలువునా పాతర వేస్తున్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులను దూరం చేస్తున్నారు. కనీసం అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు సైతం ఆ ప్రజాప్రతినిధులను ఆహ్వానించకుండా మొండిచేయి చూపుతున్నారు.

కూటమి నాయకుల మెహర్బాణీ..

పెంజెంద్రలో ఆ గ్రామ సర్పంచ్ రేమల్లి తాతబ్బాయ్ తమ పాలకవర్గ సమావేశంలో ఒక రోడ్డును తీర్మానం చేస్తే.. మరొక చోట సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి, కూటమి నాయకులు తమ మెహర్బాణీని చూపించుకున్నారు. సర్పంచ్ తాతబ్బాయ్ జనాభా ఉన్న ప్రాంతంలోని రోడ్డు నిర్మాణానికి తీర్మానం చేస్తే.. ఇళ్లు తక్కువగా ఉన్నటువంటి చోట రోడ్డును నిర్మించారనే ఆరోపణలు స్థానికుల నుంచి వస్తున్నాయి. ఈ పనులకు అధికారులు వత్తాసు పలుకుతూ రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. గతంలో చినగొన్నూరు సర్పంచ్ కోటప్రోలు నాగు కూడా తమ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణంలో తమకు ఎలాంటి సమాచారం, ఆహ్వానాలు అందటం లేదన్న ఆరోపణలు చేశారు. అధికారులు మాత్రం కూటమి నాయకుల సేవలో తరిస్తున్నారు. ఏ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులకైనా ప్రొటోకాల్ అమలు చేయాల్సిన అధికారులు అధికార పార్టీ నేతల చేతుల్లో కీలు బొమ్మలుగా మారిపోయారు. అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు మధ్య వారధులుగా ఉండాల్సిన ఉద్యోగులే రాజకీయ నాయకుల మాట వినటం సిగ్గు చేటని ప్రజా సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. అధికార పార్టీ నేతలకు తొత్తులుగా వ్యవహరిస్తున్న అధికారులపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


సీసీ రోడ్డును నిర్మిస్తూ.. తనకు సమాచారం ఇవ్వలేదని సర్పంచ్ నాగు ఆవేదన (ఫైల్)

సర్పంచ్‌కు మర్యాద లేదు



పెంజెంద్రలో ఒక రోడ్డును నిర్మించేందుకు మా పంచాయితీలో తీర్మానం చేస్తే.. మరొక చోట సీసీ రోడ్డును నిర్మించారు. దీనిపై గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను అడిగాను. ఒక ఎస్సీ సర్పంచ్‌కి రాజ్యాంగబద్ధంగా ఇచ్చే మర్యాద లేకుండా పోయింది.

– రేమల్లి తాతబ్బాయ్, పెంజెంద్ర సర్పంచ్, గుడ్లవల్లేరు మండలం


రాజ్యాంగానికి తూట్లు



ఒక రోడ్డు నిర్మాణానికి ఒక ఎస్సీ సర్పంచ్ పంచాయతీలో తమ పాలకవర్గంతో తీర్మానం చేస్తే...ఆ రోడ్డును నిర్మించకుండా పక్కన పెట్టేశారు. టీడీపీ నేతలకు కావాల్సిన చోట రోడ్డును నిర్మించుకున్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులను అవమానిస్తూ.. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి టీడీపీ నేతలు తూట్లు పొడుస్తున్నారు.

– బలుసు జితేంద్ర, వైఎస్సార్ సీపీ గుడ్లవల్లేరు మండల పోలింగ్ బూత్‌ల కన్వీనర్

నేడు ఉరుసు



పామర్రు: హజరత్ జియావుల్ హఖ్ లీమ అల్లా మొహిబుల్లా షా చిష్టి బాబా 81వ ఉరుసు మహోత్సవం పామర్రులోని దర్గా వద్ద మంగళవారం నిర్వహించనున్నట్లు దర్గా నిర్వాహకులు మోహమ్మద్ ఆసీఫ్ అలీఖాన్, మోహమ్మద్ ఆఫ్జీబ్ అలీఖాన్ తెలిపారు. నిర్వాహకులు సోమవారం మాట్లాడుతూ ఉరుసు మహోత్సవాలకు వచ్చే వారికి ఏ విధమైన అసౌకర్యాలు కలుగకుండా తగు చర్యలు తీసుకున్నామని తెలిపారు.

ఉరుసు మహోత్సవం ఇలా..

మంగళవారం సాయంత్రం 4.30 నిమిషాలకు హజ్రత్ సుల్తాన్ ఖలీఫా ఇంటి వద్ద నుంచి గంధము, చాదర్, పువ్వులు, మిఠాయిలు తీసుకుని పామర్రు పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. ఊరేగింపు అనంతరం దర్గాకు చేరుకుని గంధము, చాదర్‌ను సమర్పించి ఫాతెహా కార్యక్రమం జరుగుతుంది. భక్తులందరికీ అన్న ప్రసాదం అందజేస్తారు. తదుపరి ఖవ్వాలీ కార్యక్రమం ఎండీ ఖలీల్ రెహమ్మాన్ పార్టీ, షేక్ ఇస్మాయిల్ పార్టీల ఆధ్వర్యంలో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

పోలీస్ బ్రదర్స్‌కు మాజీ ఎమ్మెల్యే కైలే పరామర్శ


మాధవరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీపీ శౌరి, వైస్ ఎంపీపీ మహేష్

పమిడిముక్కల: వీరంకిలాకు ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన పోలీస్ బ్రదర్స్‌ను మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పరామర్శించారు. రాజులపాటి మాధవరావు ఇటీవల మృతిచెందగా, వారి కుమారులైన పెద్దాపురం క్రైం సీఐ అంకబాబు, మంత్రి వాసంశెట్టి సుభాష్ వ్యక్తిగత భద్రతా సిబ్బంది వెంకటప్పయ్యను ఫోన్‌లో సోమవారం పరామర్శించారు. ఎంపీపీ కాసాని వేద సుప్రజ, మాజీ ఎంపీపీ శౌరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, నాయకులు యేనుగ మస్తాన్‌రావు మాధవరావు చిత్రపటానికి నివాళులర్పించారు.

నులిపురుగుల నివారణే లక్ష్యం

తోట్లవల్లూరు: ఆరోగ్య వంతమైన పిల్లల కోసం నులిపురుగుల నివారణే లక్ష్యమని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయి ప్రసన్న అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ సోమవారం జరిగింది. స్థానిక జెడ్పీ పాఠశాల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ ప్రారంభించారు. పాఠశాల హెచ్‌ఎం ఫణిరాజమోహన్, సీహెచ్‌ఓ పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ అనిల్‌కుమార్, ఏఎన్‌ఎం కమలాక్షి, ఆశ కార్యకర్తలు విజయనిర్మల, విజయకుమారి, స్వాతి పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: కైకలూరు, కలిదిండి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మూలలంక పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ నసీరన్ మాట్లాడుతూ నులిపురుగుల వల్ల విద్యార్థులు పలు అనారోగ్యాలకు గురవుతారన్నారు. ఎప్పటికప్పుడు చేతులను శుభ్రపరుచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి నులిపురుగులను నివారించుకోవచ్చన్నారు.

మొవ్వలో..

మొవ్వ: మండలంలోని 16 సచివాలయాలలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. కూచిపూడి హైస్కూల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వేదరాజ్ హెచ్‌ఎం జీవి సత్యప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ బి విజయకుమార్, సచివాలయ సీహెచ్‌ఓ కే దివ్య, ఏఎన్‌ఎం వసుంధర తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: కపిలేశ్వరపురం పీహెచ్‌సీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. తాడంకి హైస్కూల్లో వైద్యాధికారి మమత, కపిలేశ్వరపురం పీహెచ్‌సీలో వైద్యులు బాలాజీ విద్యార్థులకు మాత్రలు వేశారు. 59 కేంద్రాల్లో 2,793 మంది విద్యార్థులకు మాత్రలు వేసినట్లు మమత తెలిపారు.

పామర్రులో..

పామర్రు: నులిపురుగు నివారణ మాత్రలను పీహెచ్‌సీ పరిధిలో 90 శాతం మంది విద్యార్థులకు అందజేసినట్లు పీహెచ్‌సీ వైద్యులు రాజేష్, బేగ్ తెలిపారు. మండలంలోని కనుమూరు పీహెచ్‌సీల పరిధిలోని పెదమద్దాలి, బల్లిపర్రు తదితర గ్రామాల్లో సోమవానం నులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేశారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: నులి పురుగుల మాత్రలను వాడటం వలన విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ యశస్విని తెలిపారు. సోమవారం గుడ్లవల్లేరులోని శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలవిద్యార్థులకు నులి పురుగుల మాత్రలను పంపిణీ చేశారు. సాయి విద్యానికేతన్ అధినేత శింగంశెట్టి ఆదినారాయణ పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు సోమవారం పంపిణీ చేశారు. పెయ్యేరు ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం బేతాళ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మాత్రలు పంపిణీ చేశారు.

అస్తవ్యస్తంగా రోడ్డు పనులు

మండవల్లి: స్థానిక వెలమపేట వద్ద జాతీయ రహదారి పనులు అస్తవ్యస్తంగా మారాయి. ఇక్కడ 165 జాతీయ రహదారి విస్తరణ పనుల కారణంగా డ్రెయినేజీ పనులు పూర్తి కాకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి వెలమపేట సీసీ రోడ్డుపైకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇండియన్ బ్యాంక్ ముందు నుంచి వెలమపేట చివరివరకు ఒక పక్క రోడ్డును తవ్వేసి, 45 రోజుల నుంచి అదేవిధంగా వదిలేయడంతో ఆ ప్రాంతంలో డ్రెయినేజీ నీరు నిలిచి కాలువను తలపిస్తోంది. దీంతో వ్యాధులు వ్యాపిస్తున్నాయని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ టి.అప్పారావు, నల్లా వెంకటేశ్వరరావు, తేలు శ్యామల, మరడాని సహదేవుడు, సత్యవతి, శ్రీనివాసరావు వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.


మండవల్లి వెలమపేట సీసీ రోడ్డుపై నిలిచిన డ్రెయినేజీ నీరు

గుండె పోటుకు మొదటి గంట గోల్డెన్ అవర్

కైకలూరు: గుండె పోటు వచ్చినప్పుడు మొదటి గంట గోల్డెన్ అవర్ వంటిదని కై కలూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ అల్లాడి శ్రీనివాస్ తెలపారు. గుండెకు భరోసా కార్యక్రమంపై సీహెచ్‌సీలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఛాతి నొప్పితో పాటు ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలను గుండె పోటుగా గుర్తించాలన్నారు. నొప్పి వచ్చిన వారిని 108 వాహనం ద్వారా సీహెచ్‌సీకి తీసుకువస్తే రూ.45 వేల టెనెక్లెప్లిస్ ఇంజెక్షన్ అందుబాటులో ఉందన్నారు. దీనిని ఉచితంగా అందిస్తామన్నారు. వైద్యులు శ్వేత, బాల ప్రసన్నాదేవి పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



కైకలూరు: జంగంపాడు యూపీ పాఠశాల విద్యార్థిని ఈఈఎంటి 2025 ఆన్‌లైన్ పరీక్షల్లో ప్రతిభను చూపింది. 7వ తరగతి విభాగంలో 416 మంది విద్యార్థులతో పోటి పడి జిల్లాలో ప్రథమ స్థానాన్ని సాధించినట్లు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు పి.సురేష్, హెచ్‌ఎం సత్యనారాయణ తెలిపారు. విద్యార్థిని పల్లవిని, ఉపాధ్యాయులు సురేష్, సత్యనారాయణను ఎంఈఓ రామారావు అభినందించారు.

కార్యదర్శులు అందుబాటులో లేక అవస్థలు



మండవల్లి: మండలంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎప్పుడు అందుబాటులో ఉంటారో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టి.అప్పారావు అన్నారు. కార్యదర్శులు ఏరోజు ఏ పంచాయతీలో ఉండేది తెలియజేస్తూ పంచాయతీ కార్యాలయం వద్ద నోటీసు బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రామలింగేశ్వరరావు, ఈఓపీఆర్డీ సీహెచ్ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

వృద్ధులకు చీరల పంపిణీ

గుడివాడ టౌన్: శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ప్రముఖ వ్యాపారి ఉప్పల వెంకట్ రవితేజ, తనూజ దంపతుల వితరణతో ఏలూరు రోడ్‌లోని కోటేశ్వరరావు ఫౌండేషన్ ఓల్డేజ్ హోమ్‌లో చీరలు పంపిణీ చేశారు. శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్, బొగ్గారపు తిరుపతయ్య, కె. హరిబాబు, ఎం. సత్యం, జె. తాతారావు, కె. సుధాకర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం



గుడివాడ టౌన్: పట్టణంలోని దనియాలపేట శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం ఆయన ప్రజల సమస్యలపై నిర్వహిస్తున్న మీకోసం వెనిగండ్ల కార్యక్రమంలో భాగంగా దనియాలపేట పరిసర ప్రాంతాలలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించాలి

గుడ్లవల్లేరు: తడి, పొడి చెత్తను పారిశుద్ధ్య కార్మికులు విడివిడిగా సేకరించాలని గుడ్లవల్లేరు గ్రామ కార్యదర్శి ఎ.జె.ఎల్.నరసింహారావు ఆదేశించారు. సోమవారం గుడ్లవల్లేరులోని జేమ్స్ పేటలో గృహిణులు నుంచి పారిశుద్ధ్య కార్మికులు చెత్తను రిక్షాల్లో సేకరించే ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు.

శరవేగంగా గీతామందిర ఆధునికీకరణ

13 నుంచి 15 వరకు విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు


మంటాడలో ఆధునికీకరించిన గీతామందిరం

పమిడిముక్కల: మండలంలోని మంటాడలో 1970లో ఏర్పాటైన గీతామందిరాన్ని దాతల సాయంతో గ్రామస్తులు శరవేగంగా ఆధునికీకరించారు. 18 మంది సభ్యులతో కమిటీగా ఏర్పాటై సుమారు రూ.30 లక్షలపైగా విరాళాలు సేకరించి మందిరాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. గ్రామానికి చెందిన పులి హనుమయ్య, గురవయ్య కుటుంబసభ్యుల సహకారంతో గ్రామస్తులు పూరిపాకలో గీతామందిరాన్ని నెలకొల్పారు. మేరుగ వీరరాఘవయ్య, పులి పోతురాజు, పులి శ్రీరంగం, పులి సీతారామయ్య, మేరుగ బ్రహ్మేశ్వరరావు, మేరుగ వెంకట్రామయ్య 10 సెంట్ల స్థలాన్ని సమకూర్చడంతో తూమాటి నాగయ్య, పొన్నూరు అంజమ్మ, పులి పాపాయమ్మ సహకారంతో గీతామందిరం కొనసాగుతూ వచ్చింది. 1997లో ఉమ్మిడిశెట్టి రామకోటేశ్వరమ్మ వ్యవస్థాపక అధ్యక్షురాలిగా గురుప్రసాద్ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా శాశ్వత భవనం నిర్మించారు.

విగ్రహ ప్రతిష్ట

ఆధునికీకరించిన గీతామందిరంలో ఈ నెల 13 నుంచి 15 వరకు విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి, కెనరా బ్యాంక్ మాజీ జీఎం పులి సాయిబాబు తెలిపారు. మందిరంలో శ్రీ విఘ్నేశ్వర, ఆంజనేయ, సాయిబాబా, నాగదేవత విగ్రహాలను ప్రతిష్టించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురు, శుక్ర, శని వారాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు చేస్తున్నట్లు తెలిపారు.

శనివారం ఉదయం 5 గంటల నుంచి నిత్య అర్చనలు, మహాశాంతి హోమములు, మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన, 8 గంటల 17 నిమిసాలకు విగ్రహ ప్రతిష్ట, 10 గంటలకు శ్రీకృష్ణ, రుక్మిణీ కల్యాణం, 11 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పింఛన్ల పునఃపరిశీలన

పామర్రు: ఎన్టీఆర్ భరోసా ఆరోగ్య పింఛన్ల పునః పరిశీలన మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం ప్రత్యేక బృందం అధికారి మనవ రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 43 మంది ఒక్కొక్కరు రూ.1,500పెన్షన్‌ను అందుకుంటున్నారని తెలిపారు. వీరిలో 42 మంది అందుబాటులో ఉన్నారన్నారు.

వీరమ్మ తల్లి దేవస్థాన వెబ్‌సైట్ ప్రారంభం

గుడ్లవల్లేరు: మామిడికోళ్లలో వందేళ్ల పైగా చరిత్ర కలిగిన శ్రీ వీరమ్మ తల్లి వారి దేవస్థాన వెబ్‌సైట్‌ను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోమవారం ప్రారంభించారు. వచ్చే నెల 15న జరిగే అమ్మవారి దేవస్థాన ప్రతిష్టకు ఎమ్మెల్యే రామును ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తోట మల్లికార్జునరావు, కూసం హనుమప్రసాద్, తోట ప్రసాద్, నరేంద్ర తొలుత ఆహ్వానించారు.

అధికారులు కించపరుస్తున్నారు

పెదపారుపూడి: గ్రామాభివృద్ధికి సహకారం అందించాల్సిన పంచాయతీ అధికారులే తనను కించపరుస్తున్నారని సర్పంచ్ చప్పిడి సమీరా ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆమె మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి సురేంద్ర చౌదరి, ఎంపీడీఓ టీ. సీతామహాలక్ష్మీ ఇద్దరూ కలిసి దళిత సర్పంచ్ అయిన తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. గ్రామాభివృద్ధికి రూ.20 లక్షల మంజూరు అయినా పనులు జరగకుండా ఆటంకం కలిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఉప సర్పంచ్ గాంధీ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పామర్రు: గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ రాజేంద్ర ప్రసాద్ సోమవారం తెలిపారు. బాపూజీ పేటలో పేకాట నిర్వహిస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.6,700ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నేడు అడుసుమిల్లి పేరిట సేవలు

గుడ్లవల్లేరు : స్థానిక ఏఏఎన్‌ఎం అండ్ వీవీఆర్ ఎస్ఆర్ పాలిటెక్నిక్ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత అడుసుమిల్లి అశ్వర్థ నారాయణమూర్తి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన పేరిట పేదలకు మంగళవారం సేవా కార్యక్రమాల్ని నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ కేవీ కృష్ణారావు సోమవారం తెలిపారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు, పేదలకు పింఛన్లను అందించనున్నట్లు పేర్కొన్నారు.

రశీదు పుస్తకం పోయినది

పులపర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లి. నెం. H.963, పులపర్రు సొసైటీ కార్యదర్శి విన్నపం. పులపర్రు సొసైటీకి సంబంధించిన జనవరి 2024, ఫిబ్రవరి 2024, మార్చి 2024, ఏప్రియల్ 2024, మే 2024 లకు సంబంధించిన సంఘం లావాదేవీలు ఉన్న రశీదు పుస్తకము కైకలూరు కె.డి.సి.సి. బ్యాంక్‌కు వెళుతుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎంతవెదకినా కనబడలేదు. ఆ పుస్తకములు దొరికిన వారు దయచేసి సొసైటీ అడ్రస్‌కు లేదా కైకలూరు టౌన్ పోలీస్‌స్టేషన్‌కు గానీ అందజేయగలరు లేదా ఈ క్రింది ఫోన్‌కు తెలియజేయగలరు.

ఇట్లు, **సొసైటీ కార్యదర్శి, పులపర్రు,**
ఫోన్ : 91822 21754

ఘనంగా సత్యదేవుని రాయబార మహోత్సవం


రాయబారోత్సవంలో శ్రీనివాసరావు, వెంటేశ్వరరావు దంపతులు

గుడ్లవల్లేరు: రెండో అన్నవరంగా ప్రసిద్ధి గాంచిన గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాయబార మహోత్సవాన్ని వేద పండితుడు మురళీ కృష్ణమాచార్యులు, రొంపిచర్ల శ్రీనివాసాచార్యుల బృందం సోమవారం ఘనంగా నిర్వహించారు. వల్లెపు శ్రీనివాసరావు, వెంకటేశ్వరమ్మ దంపతులు, వల్లెపు వెంకటేశ్వరరావు, అనూష దంపతులు పీటలపై కూర్చొని నిర్వహించారు. తొలుత స్వామివారికి విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలను చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు.